# టేప్ రికార్డర్

పరిగి వసంతకుమార్



**మా రామారావు** ఈమధ్య టేప్ రికార్డరు ఒకటి కొన్నట్టు తెలిసింది. అందరి దగ్గిర లేనిది ఏదో కొత్త వస్తువు కొనడం వాడి కలవాటు. "ఇంట్లో రేడియో ఉండగా ఈ ట్రాన్సిస్టరు ఎందుకోయ్!" అని అడిగాను ఓసారి వాణ్ణి.

"మన దగ్గిర ఏదోఒకటి కొత్తది లేకపోతే మనం పాతబడిపోతాం! పాప్యులారిటీ అంటే ఏమనుకున్నావ్!" అన్నాడు రావు.

టేప్ రికార్డరు చూద్దామని, ఓ ఆదివారం రామారావు ఇంటికి వెళ్ళాను. టేప్ రికార్డరు కొనడానికి పడ్డ అవస్థ ఒక పావుగంటసేపు వర్ణించాడు—"జర్మన్ మేక్! దీనికోసం బొంబాయి పోవలసి వచ్చింది!"అంటూ.

"ఇదంతా సరేగాని ఆ టేప్ రికార్డరు చూపించవోయ్!"

"బోనస్ ఇస్తున్నారటగా మీ కంపెనీవాళ్ళు! నువ్వుకూడా ఒకటి కొను!"

"పధ్నాలుగు వందలు ఖరీదుచేసే టేప్ రికార్డరు కొనడమే! ఈ స్వరూపానికి ఎవరైనా రీజనబుల్ ప్రైస్ ఆఫర్ చేస్తే డిస్‌పోజ్ ఆఫ్ చేసేద్దామనుకుంటున్నా!"

"ఏం! మార్కెట్‌లో ఎంతకి అడుగుతున్నారు?"

ఇంతలో రామారావు తండ్రిగారు వచ్చారు—"ఏమోయ్! ఎలక్షన్లు ఏమంటున్నాయ్!" అంటూ.

"ఎలక్షన్లా, సార్! ఎలక్షన్లు ఓటింగ్, డెమాక్రసీ— ఇవన్నీ ఎవడికి కావాలండీ! పనిలేని, పనికిరాని వాళ్ళంతా ఎలక్టయ్యే రోజులివి! మొన్న ఎన్నుకొన్న మ్యునిసిపల్ ప్రెసిడెంట్‌నే తీసుకోండి! ఆ మహానుభావుడికి సంతకం పెట్టడం కూడా రాదని వినికిడి! మా వార్డులో కొంత మందికి ఓటుకు రెండు రూపాయలిచ్చాడని కూడా తెలిసింది. దానికేంలెండి! రెండు రూపాయలిచ్చినంత మాత్రాన ఆయనకే ఓటువెయ్యాలని ఎక్కడుంది? సీక్రెట్ బాలెట్‌గదా! ఆ రెండు రూపాయలు పుచ్చుకుని, మన ఇష్టం వచ్చిన వాడికే ఓటువేస్తే సరి! అందుకే డెమాక్రసీ కొంతయినా మేలు!" అన్నాను.

"మీ ఆఫీసరుకి ప్రమోషను వచ్చిందట!" అన్నాడు రావు.

"ఆఫీసరు సంగతి ఎందుకుకానీ, ఆ టేప్ రికార్డరు కాస్త తీసుకురావూ!"

"తీసుకువస్తానుగాని, నీ ఆఫీసర్ ఉద్యోగంలో చేరి ఒక సంవత్సరమేగా అయింది?"

"ఈ రోజుల్లో తాహతుఎవడికికావాలోయ్! సిఫార్సే, మనీపర్సే లేనిదే మా ఆఫీసరుకి ఎవడు ఉద్యోగం ఇచ్చేవాడు? బి. ఎ. థర్డ్ క్లాస్‌లో పాసైనా, నాబోటి గాళ్ళకంటె వాడి జీవితం ఏం బావుంది? అయినా ప్రమోషన్ ఇవ్వకేంలే, ఆఫీసరు పెళ్ళాం చెల్లెలు మొగుడు కంపెనీ డైరెక్టర్లలో ఒకడు! అది అలా ఉంచు! మా ఆఫీసరు మోడల్ హెన్‌పెక్‌డ్ హజ్బెండు! ఆఫీసుకి వచ్చిన దగ్గిరనించి మళ్ళీ సాయంకాలం ఇంటికి వెళ్ళేవాకా, గంటకి ఒకసారి అయినా ఆ సతీమతల్లి ఫోన్‌లో తిట్టేతిట్లన్నీ ఓపిగ్గా భరిస్తుంటాడు! ఇక ఇంటికి పోయిన తరవాత సంగతి చెప్పాలా? మా ఆఫీసరు చరిత్ర ఇంకా చాలా ఉందిలే! అదంతా ఇప్పుడెందుకుకానీ, ఆ రికార్డరేదీ? అదేదో ఓ పెద్ద రహస్యంలా దాచేస్తున్నావ్!"

"ఎక్కడపెట్టానో జ్ఞాపకంరావడ లేదోయ్!మేడమీద ఉండాలి! చూసొస్తాను! ఆగు!" అన్నాడు. "అన్నట్టు ఇక్కడే ఉంది! పొద్దున రేడియోలో ఏదో వస్తే రికార్డ్‌చేసి డ్రాయర్‌లోఉంచా!" అంటూ సగం తెరిచిన డ్రాయరునుంచి టేప్ రికార్డర్ బయటికి తీశాడు రామారావు.

"రికార్డు చేసినది ఏవన్నా వినిపించవోయ్!" అన్నాను.

"ఇదిగో! విను. మొన్న మినిస్టరుగారు మా ఊరు వచ్చినప్పుడు ఇచ్చిన స్పీచ్!": 'మీరంతా దేశోద్ధారకులు కావాలి! మాతరం వాళ్ళని చూడండి! పగలనక, రాత్రనక, ఎండనక, వాననక దేశసేవచేసి, జైళ్ళకివెళ్ళి, సకల కష్టాలు అనుభవించి, భారత మాతకు దాస్య శృంఖలాలనుండి విముక్తి కలిగించాం. ఈ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనే కర్తవ్యం....'

"ఈ వాగుడెందుకుకానీ, ఇంతకంటే మంచివేవీ రికార్డ్ చెయ్యలేదోయ్?"

"సరేలే! ఇంకొకటి వినిపిస్తా!" అంటూ ఆ టేప్ అటు ఇటు చుట్టడం ప్రారంభించాడు.

గోల మళ్ళీ ప్రారంభం: 'ఎలక్షన్లా, సార్! మొన్న ఎన్నుకొన్న మునిసిపల్ ప్రెసిడెంట్‌నే తీసుకోండి!.... సంతకం పెట్టడం కూడా రాదని వినికిడి!.. ఓటుకి రెండు రూపాయలిచ్చాడని... సిఫార్సే, మనీపర్సే లేనిదే మా ఆఫీసరుకి ఎవడు ఉద్యోగం ఇచ్చేవాడు?...మా ఆఫీసరు చరిత్ర ఇంకా చాలా ఉందిలే!'

రామారావు ఇంతపని చేస్తాడని నేను కలలో కూడా అనుకోలేదు! అందర్ని అన్నమాటలు రికార్డు చేశాడు! ఆఫీసర్ని అవమానం చేసినట్టు, మ్యునిసిపాలిటీ ప్రెసిడెంట్‌ను ఎగతాళిచేసినట్టు పూర్తిసాక్ష్యం ఉంది! ఇది వాళ్ళ చెవిని బడితే!... పరనింద, వ్యర్థమైన పేలాపన! ఆదివారం రోజున ఎంత పని జరిగింది!

"టేప్ రికార్డర్ ఉంటే చాలా ఉపయోగం కాదుటోయ్?"హాస్యాస్పదంగా ఉందిరావుకు!

"బాబ్బాబు! నీకు పుణ్యం ఉంటుంది! నే నన్నదంతా ఆ రికార్డు నుండి తీసెయ్యవూ! నేనన్నమాటలన్నీ మా ఆఫీసరుకి తెలిస్తే ఏమన్నా ఉందా! దయచూపించవూ! నీ 'ప్రియమిత్రుణ్ణి' నీ సహచరుణ్ణి!" అని ప్రాధేయపడ్డాను.

"ఓ ముప్ఫయి రూపాయలియ్యవోయ్! కొత్త టేప్‌కొనాలి! నువ్వు చెప్పినట్టే ఈ టేప్ నీ కిచ్చేస్తాను! ఏమన్నా చేసుకో! నీ ఇష్టం!" అన్నాడు రావు నా బాధ బాగా గ్రహించి కాబోలు!

"తీసుకో! నిక్షేపంగా! ఇదుగో! ముప్ఫయి. సరిపోయిందా?"

"ఓ. థాంక్స్!"

"నో మెన్షన్. వస్తా!"

"మళ్ళీ ఎప్పుడు?..."

"వస్తా! వస్తా!"

★